## క్లుప్తంగా

### ఇండియన్ నేషనల్ ఆటోక్రాస్ చాంపియన్‌షిప్ ప్రారంభం

**రాయదుర్గం:** ఇండియన్ నేషనల్ ఆటోక్రాస్ చాంపియన్‌షిప్ ప్రారంభమైంది. రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని మూడు రోజులపాటు నిర్వహిస్తారు. పుట్టుకతో వచ్చే గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న పిల్లలకు చికిత్స చేసేందుకు ఆపరేషన్ థియేటర్ నిర్మాణానికి అవసరమైన రూ.7.5 కోట్ల నిధుల సమీకరణకు రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలక్ట్ ఆర్టిస్ బుసిరెడ్డి శంకర్‌రెడ్డి, ఆర్‌సీ లేక్ జిల్లా మొయినాబాద్ అధ్యక్షుడు ఆర్టిస్ పతంజలితో కలిసి గచ్చిబౌలిలోని బౌల్డర్‌హిల్స్‌లో ప్రారంభించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్ సభ్యులు పాల్గొన్నారు.

### స్మార్ట్‌గా సైబర్ మోసం

- మోసపోయిన ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

**పటాన్‌చెరు టౌన్:** సైబర్ వలలో పడి ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మోసపోయారు. అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులు రెడ్డి కథనం ప్రకారం... అమీన్‌పూర్ కృష్ణదేవరాయ కాలనీలో ఉండే సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి గత ఏప్రిల్ 20వ తేదీన ఆయన ప్రమేయం లేకుండానే క్రెడిట్ కార్డుకు సంబంధించి మొబైల్ సందేశం వచ్చింది. సందేశాన్ని ఓపెన్ చేయగానే క్రెడిట్ కార్డు నుంచి లక్షా నాలుగు వేల రూపాయలు కట్ అయ్యింది. మోసపోయినట్టు గుర్తించి సైబర్, అమీన్‌పూర్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. మరో ఘటనలో పట్టణంలోని జయలక్ష్మీనగర్ కాలనీలో ఉండే సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ఏప్రిల్ 19వ తేదీన పార్ట్ టైం ఉద్యోగం అంటూ సందేశం వచ్చింది. ఆ సందేశాన్ని ఓపెన్ చేసి రూ.1.40లక్షలు చెల్లించి వారు ఇచ్చిన టాస్కులు పూర్తి చేశాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో మోసపోయినట్టు గుర్తించి అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### ఉచిత వైద్యశిబిరం

**రాయదుర్గం:** గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సీఎస్‌సీ హెల్త్ కేర్ అండ్ వెల్‌నెస్ సర్వీసెస్ పర్యవేక్షణలో కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, తెలంగాణ భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ మండలి, సీఎస్‌సీ హెల్త్‌కేర్ అండ్ వెల్‌నెస్ సర్వీసెస్ ప్రతినిధులు, స్థానికులు, కార్మికులు పాల్గొన్నారు.

# వర్షాకాలం ముందస్తు చర్యలు తీసుకోవాలి



వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, జోనల్ కమిషనర్ శంకరయ్య తదితరులు

**మియాపూర్:** వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. శనివారం చందానగర్ సర్కిల్ కార్యాలయం వద్ద మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్ వాహనాలను ఉప కమిషనర్ సుధాంశ్, కార్పొరేటర్లు మంజులరఘునాథ్ రెడ్డి, పూజితాగౌడ్, జగదీశ్వర్‌గౌడ్, నార్నె శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చందానగర్ సర్కిల్ పరిధిలో ఎమర్జెన్సీ కింద ఆరు టాటా ఏసీ ఆటోలు, 4 జేసీబీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జీహెచ్‌ఎంసీ అధికారులు డీఈ స్రవంతి, ఎస్ఎస్ శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు శర్మ, చారీ, వెంకటేష్, పాల్గొన్నారు.

**శేరిలింగంపల్లి సర్కిల్‌లో..**

శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయ ఆవరణలో మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్ వాహనాలను జోనల్ కమిషనర్ శంకరయ్య, ఉప కమిషనర్ వెంకన్న, కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, జగదీశ్వర్‌గౌడ్, గంగాధర్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు.

# జగనన్న గెలుపునకు ఐటీ ఆర్మీ

**హైటెక్‌సిటీలో జరిగిన వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ సదస్సులో సునీల్‌కుమార్‌రెడ్డి**



**గచ్చిబౌలి:** జగనన్న గెలుపు కోసం గ్రామ స్థాయిలో వైఎస్‌ఆర్‌సీపీ ఐటీ వింగ్ ఆధ్వర్యంలో మిషన్ఐటీ ఆర్మీ పని చేస్తుందని ఆ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్ సునీల్‌కుమార్‌రెడ్డి పోసింరెడ్డి అన్నారు. శనివారం మాదాపూర్‌లోని బుట్ట కన్వెన్షన్‌లో 'వైఎస్‌ఆర్‌సీపీ ఐటీ వింగ్' సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీ ఉద్యోగుల కనెక్టివిటీ కోసం ఇప్పటికే బెంగళూర్ మీట్ ఏర్పాటు చేశామన్నారు. త్వరలో చెన్నై, పూణెలోనూ ఐటీ ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం మళ్లీ కొనసాగాల్సిన అవసరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. ఆయన నిర్దేశించిన టార్గెట్ 175 సీట్లు సాధించి తీరే వరకు ఐటీ సైన్యం విశ్రాంతి లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏపీలో ఐదు లక్షల ఐటీ ఉద్యోగులు ఉన్నారని, 50 శాతం మంది ఉద్యోగులను వైఎస్‌ఆర్‌సీపీ మిషన్ ఐటీ ఆర్మీలో ఎన్‌రోల్ చేయించాలన్నారు. ప్రతి ఒక్కరు 50 మందిని చేర్పిస్తే ఐటీ వింగ్ మరింత బలోపేతమవుతుందన్నారు.

**ఏపీ అల్కెమిస్ట్ జగనన్న**

ఖనిజాన్ని బంగారంగా మార్చేది అల్కెమిస్ట్ అని, ఏపీ అల్కెమిస్ట్ జగనన్న అని సునీల్ పేర్కొన్నారు. అట్టడుగు వర్గాలను ఉన్నతస్థాయికి తీసుకెళ్లేందుకు పార్టీ పెట్టినప్పటి నుంచి ఆలోచన చేస్తున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న ప్రతి సంక్షేమ పథకానికి ఓ కారణం ఉందన్నారు. చివరగా వైఎస్‌ఆర్‌సీపీ మిషన్ ఐటీ ఆర్మీ పోస్టర్ విడుదల చేశారు. ఐటీ సదస్సులో తెలుగు రాష్ట్రాలకు చెందిన వేలాదిమంది పాల్గొన్నారు.




మిషన్ ఐటీ ఆర్మీ పోస్టర్‌ను విడుదల చేసిన సునీల్‌కుమార్‌రెడ్డి తదితరులు

### స్వరార్చన.. వీణార్చన

**మాదాపూర్:** మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న స్వరార్చనలో భాగంగా కళాకారులు వీణార్చనతో విశేషంగా ఆకట్టుకున్నారు. సప్తస్వరాలు సంస్థ వీణార్చనతో అలరించారు. గురువు లక్ష్మీపద్మావతి శిష్యులు సుచరిత, సుదా కోట, ఉమామహేశ్వరీ లక్కరాజులు మహాగణపతి, చక్కని తల్లికి చాంగుభళా, తందనానా, సామజవరగమన లాంటి కీర్తనలను వీణపై ఆలపించారు.

### గొడుగులు పంపిణీ

**ఆల్విన్‌కాలనీ:** ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని చిరు వ్యాపారులకు చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి ఇచ్చిన గొడుగులను ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పక్కన వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారులకు వేసవి కాలంలో ఈ గొడుగులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఎంపీ రంజిత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో చిన్నోళ్ల శ్రీనివాస్, ఖాజా, వాసుదేవరావు, పోశెట్టి గౌడ్, సాయిగౌడ్, పుట్టందేవి తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ కట్టడం కూల్చివేత

**మియాపూర్:** మియాపూర్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ రోడ్డులో కోకట్ గ్రో అపార్ట్‌మెంట్‌ను ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 28 లోని ప్రభుత్వ భూమిలో గోడ నిర్మించారంటూ స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో శనివారం ఉదయం శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. కాగా ఇక్కడ గతంలో ఓ నిర్మాణం చేపట్టగా అధికారులు కూల్చివేసి ప్రభుత్వ స్థలమని బోర్డు పెట్టారు. అయినా శుక్రవారం రాత్రి కొందరు గోడ కట్టారు. ఫిర్యాదు రావడంతో అధికారులు గోడను కూల్చి వేస్తున్న సమయంలో ప్రజాప్రతినిధుల నుండి ఫోన్ రావడంతో కొంత గోడను కూల్చివేసి వెనుదిరిగి పోయారని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### కారు బీభత్సం

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** రామచంద్రాపురం పట్టణంలోని బీరంగూడ కమాన్ వద్ద పటాన్‌చెరు వెళ్లే మార్గంలో ఒక కారు రోడ్డుపై నిలబడవారిపై దూసుకెళ్లిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. బస్సు కోసం వేచి ఉన్న మహిళలను కారు ఢీ కొట్టింది. ఐదుగురిని ఢీకొట్టగా, అందులో పూజ, రంజాబి పరిస్థితి విషమంగా ఉంది. వీరి కన్నా ముందు రెండు అంబులెన్స్‌లు, ద్విచక్ర వాహనాలను కారు ఢీ కొట్టింది. మితిమీరిన వేగం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

# కేన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నివారణ సాధ్యం



కేన్సర్ సెంటర్ లోగో, బ్రౌచర్‌ను విడుదల చేస్తున్న మెగాస్టార్ చిరంజీవి, వైద్యులు

- మెగాస్టార్ చిరంజీవి
- నానక్‌రాంగూడలో స్టార్ హాస్పిటల్‌లో కేన్సర్ సెంటర్ ప్రారంభం

**హఫీజ్‌పేట్:** కేన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నివారించవచ్చని మెగాస్టార్ చిరంజీవి పేర్కొన్నారు. శనివారం గచ్చిబౌలి నానక్‌రాంగూడలోని స్టార్ హాస్పటల్‌లో ఏర్పాటు చేసిన కేన్సర్ సెంటర్‌ను స్టార్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మన్నం గోపీచంద్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గూడపాటి రమేష్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేన్సర్ సెంటర్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి వివరాలను వైద్య బృందాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే తప్పకుండా వైద్యం ద్వారా నివారించవచ్చన్నారు. స్టార్ హాస్పిటల్‌లో కేన్సర్ చికిత్స కోసం ఆధునిక యంత్ర పరికరాలు, రోగనిర్ధారణ విధానాలతో కూడిన అధునాతన చికిత్సకేంద్రం నెలకొల్పినందుకు వైద్య బృందాన్ని అభినందించారు. కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు కావలసిన డబ్బులు తాను ఇస్తానని, వివిధ చోట్ల క్యాంపులు నిర్వహించి ప్రజల్లో కేన్సర్‌పై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఎండీ గోపీచంద్ మాట్లాడుతూ మొత్తం 10 అంతస్తుల్లో స్టార్ కేన్సర్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు కేన్సర్‌తో పోరాటం చేసి విజయం సాధించిన కొంతమందిని చిరంజీవి సత్కరించారు.

# వరదనీటి కాలువ పనులు ప్రారంభం

**మాదాపూర్:** కొండాపూర్ డివిజన్ నెక్టార్ గార్డెన్ నుంచి దుర్గం చెరువు నాలా వరకు రూ.50 లక్షల రూపాయల అంచనావ్యయంతో చేపడుతున్న వరదనీటి కాలువ నిర్మాణ పనులను ఎమ్మెల్యే గాంధీ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని వరదనీటి కాలువ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ శ్రీనివాస్, డీఈ రమేష్, నెక్టార్ గార్డెన్‌వాసులు పాల్గొన్నారు.



వరదనీటి కాలువ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ

# బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ పీపీ రాథోడ్, సిబ్బంది

**పటాన్‌చెరు టౌన్:** బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈఓ పీపీ రాథోడ్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా పటాన్‌చెరు, అమీన్‌పూర్ మండల పరిధిలో 'డోర్ టూ డోర్ ప్రోగ్రాం'లో భాగంగా ఇంటికి వెళ్లి బడి ఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఈఓ పీపీ రాథోడ్ మాట్లాడుతూ జూన్ 3 నుంచి 9వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న కార్యక్రమాలు వివరించి, బడి ఈడు, బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలని సూచించారు.

### బీజేవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శిగా విజయ్‌కుమార్‌రెడ్డి

**మియాపూర్:** బీజేవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శి, రాష్ట్ర మీడియా ఇంచార్జ్‌గా శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన సంజన్నగారి విజయ్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. నగరంలో జరిగిన బీజేవైఎం రాష్ట్ర సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు భానుప్రసాద్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నట్లు విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తనను నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



# మౌలిక వసతుల కల్పనకు సహకరించాలి

**రాయదుర్గం:** గచ్చిబౌలి డివిజన్‌లోని కాలనీలు, బస్తీలలో మౌలిక వసతుల కల్పనకు సహకరించాలని జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ శంకరయ్యకు శనివారం గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ గచ్చిబౌలి డివిజన్‌లో చేపట్టవలసిన, కొనసాగుతున్న అభివృద్ధి పనుల గురించి ఆయనకు వివరించారు. పెండింగ్ పనులను పూర్తి చేసేలా చూడాలని కోరారు. అనంతరం శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వెంకన్న, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్‌తో ప్రత్యేకంగా సమావేశమై గచ్చిబౌలి డివిజన్‌లోని సమస్యలను వివరించారు. వారు సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశాల్లో శేరిలింగంపల్లి సర్కిల్ డీఈ శ్రీనివాస్, డీఈ విశాలాక్షి, ఏఈ సునీల్, రమేష్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.



### క్రీడలకు ప్రాధాన్యం

**ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి**

**పటాన్‌చెరు:** క్రీడా రంగానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని, పటాన్‌చెరు క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం పాటి గ్రామంలో జై బజరంగ్‌బళి కబడ్డీ టీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి ఓపెన్ టు ఆల్ కబడ్డీ టోర్నమెంట్ పోటీలను శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ లక్ష్మణ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, స్వామి గౌడ్, గ్రామ ప్రజా ప్రతినిధులు, నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

### నేడు రక్తదాన శిబిరం

**పటాన్‌చెరు టౌన్:** తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాలు పురస్కరించుకుని పటాన్‌చెరు సబ్ డివిజన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు ఇస్నాపూర్ సమీపంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు సీఐ వేణుగోపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి యువత అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

